## క్లుప్తంగా

### 'డబుల్' ఇళ్ల పంపిణీ వాయిదా



గ్రామసభకు హాజరైన లబ్ధిదారులు

చుంచుపల్లి: మండలంలోని శ్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీలో పేదల కోసం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీని అధికారుల వాయిదా వేశారు. తహసీల్దార్ కృష్ణ ఆదేశాల మేరకు శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు హాజరైన పలువురు పేదలు పెద్ద సంఖ్యలో ఇళ్ల కోసం పోటీ పడ్డారు. ఇళ్ల పంపిణీ పారదర్శకంగా లేదని పలువురు డిమాండ్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ సత్యనారాయణ, ఆర్ఐ మంగ్యా నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి భాషా తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

కొత్తగూడెంరూరల్: ఈ నెల 24న మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గర్భస్థ శిశువుతో పాటు బాలింత మృతి చెందిన ఘటనకు సంబంధించి విచారణ నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడా కుమారస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనతో విచారణ వేగవంతంగా పూర్తి చేసి ఇందుకు బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

### ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాల్వంచరూరల్: బంద్రుగొండ గ్రామంలో శనివారం జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రాజు, కృష్ణప్రసాద్ 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. మలేరియా, డెంగీ జ్వరాలు నిర్ధారణ కాలేదని స్వల్ప అనారోగ్యంగా ఉన్నవారికి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ రాజు తెలిపారు. ఈ శిబిరంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామిరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### గుడిసెవాసుల స్థలం సర్వే

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా వద్ద పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని అటవీశాఖ అధికారులు శనివారం సర్వే చేశారు. అటవీ భూభాగాన్ని ఆక్రమించుకొని తాత్కాలిక ఇళ్లు ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఇప్పటికే రెండుసార్లు అటవీశాఖ అధికారులు పేదలకు నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా పేదలు ఆక్రమించుకున్న స్థలం ఎంత మేర ఉందనే విషయమై అటవీశాఖ సర్వేయర్లు సర్వే చేశారని ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు తెలిపారు.

### హర్షం



కేక్ కట్ చేస్తున్న ఖాసీం

పాల్వంచ: మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డ్‌కు ఎంపిక చేయడం పట్ల మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్.ఖాసీం ఆధ్వర్యంలో శనివారం సంబురాలు నిర్వహించారు. చిరంజీవి ఫ్లెక్సీ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంపెల్లి కనకేశ్, చింతా నాగరాజు, మెలా బాషా, శ్రీను, హరి, మీరా బాషా, ప్రసాద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళ అదృశ్యం

ఇల్లెందు: భర్త రోజువారీ పనికి వెళ్లిన సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ తిరిగి ఇంటికి రాలేదు. భర్త గ్రామంలో బంధువుల ఇళ్లల్లో వెతినా ఆచూకీ దొరకకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్ఐ ఘనీ తెలిపిన వివరాలు... మండలంలోని వేములవాడ గ్రామానికి చెందిన 27 ఏళ్ల మూతి ఊర్మిళ ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# 'పాలకవర్గానికి' నాలుగేళ్లు

- మున్సిపాలిటీ కార్యాలయంలో సంబురాలు
- పలు తీర్మానాలకు ఆమోదం



స్వీట్లు తినిపించుకుంటున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గం ఎన్నికై నాలుగు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు శనివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎజెండాలోని కొత్తగూడెం పురపాలక సంఘ పరిధిలోని 36 వార్డులలో కోతులను, కుక్కలను పట్టుకునేందుకు ఖర్చు రూ.4.00 లక్షలను పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి విడతల వారీగా బిల్లులు చెల్లింపుకు, శానిటేషన్ పనులకు ఉపయోగించు స్వచ్ఛ ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు, జేసీబీ మొదలగు వాహనములు రిపేరుకు ఖర్చు రూ.5.00 లక్షలను విడతల వారీగా బిల్లు చెల్లింపులపై చర్చించారు. దీంతో పాటుగా పర్యావరణ కాలుష్య నివారణ చర్యలలో భాగంగా గణేష్ మట్టి విగ్రహ ప్రతిమలను పంపిణీ చేసిన బిల్లు మొత్తం రూ.లక్ష పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు, గౌరవ హైకోర్టు కేసులకు సంబంధించిన అడ్వకేట్ లీగల్ చార్జీలు రూ.లక్ష మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, హైదరాబాద్ వారికి పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి బిల్లు చెల్లింపు చేయుటకు, కిన్నెరసాని నీటి సరఫరా పైపు లైన్లపై మరమ్మతుల ఖర్చు రూ.రెండు లక్షలు, కూలిలైన్ నుంచి రైల్వే డిపార్ట్‌మెంట్ వారికి 100 ఎంఎం డయా కొత్త పైప్ లైన్ నిర్మాణానికి రూ.లక్ష, రామా టాకీస్ వద్ద 150 ఎంఎం డయా, 600 డయా ఇంటర్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు రూ.లక్ష, మరమ్మతులకు సామగ్రి కొనుగోలుకు రూ.5 లక్షలను పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి బిల్లు చెల్లింపు, సాధారణ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, ర్యాంప్‌లు, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్ వైరింగ్, హోల్డర్స్, బల్బులు, సీలింగ్ ఫ్యాన్స్, ఎల్ఈడీ ట్యూబ్ లైట్స్ ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలించేందుకు ఆటోల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలలో టెంట్లు వాటర్ క్యాన్లు ఏర్పాటు చేసేందుకు రూ.4.99 లక్షలను పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దామోదర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కమిషనర్ జి.రఘు, డీఈ కె.రవికుమార్, మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్లు, సాహితి, డి.రాము టీపీఎస్ బి.ప్రభాకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీరోజు తాగునీరు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో కిన్నెరసాని మంచినీటిని ప్రతీరోజు సరఫరా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో రోజుల తరబడి కిన్నెరసాని తాగునీరు రాక ప్రజలు అల్లాడుతుంటే ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని, మున్సిపల్ పాలకపక్ష ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల కోసం కాకుండా కాంట్రాక్టర్ల కోసం, కుర్చీల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. కిన్నెరసాని రెండో పైపు లైన్ పనుల్లో జరుగుతున్న జాప్యంపై కలెక్టర్ చొరవ తీసుకొని శుద్ధి చేసిన మంచినీరు ప్రతీరోజు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు, అసెంబ్లీ అధ్యక్షుడు చేనిగరపు నిరంజన్‌కుమార్, సందీప్, నవతన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కొత్తగూడెంరూరల్: సింగరేణి సంస్థలో గత నెల జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కొత్తగూడెం ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘం నాయకులు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ రజాక్, కొత్తగూడెం కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించటంతోపాటు, వారికి ఇచ్చినా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేరుస్తుందన్నారు.

### దిష్టిబొమ్మ దహనం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం ఏకపక్షంగా పాత కమిటీలను రద్దు చేసి, కొత్తవారికి పదవులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పదవులు ఇచ్చే అర్హత అధ్యక్షుడు, వర్కింగ్ ప్రసిడెంట్‌కు తప్ప సెక్రటరీ జనరల్‌కు లేదన్నారు. యూనియన్‌లో సెక్రటరీ జనరల్ పోస్టు లేకున్నా, ఆయన సృష్టించుకుని ఇతర నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. యూనియన్‌లో మొదటి నుంచి కొనసాగుతున్న వారిని కాదని ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం గర్హనీయమన్నారు. సి.త్యాగరాజన్, నాయకులు ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రేపు చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న వీరభద్రం

సింగరేణి(కొత్తగూడెం): పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదలకు జనవరి 29న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం, పట్టణంలోని పలు పాఠశాలల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, జిల్లాలో నూతన వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలనే డిమాండ్లతో చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందా నాగకృష్ణ, సాగర్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



యాకరాజును సన్మానిస్తున్న మామిడిగుండాల గ్రామస్తులు

ఇల్లెందురూరల్: గణతంత్ర్య దినోత్సవంలో ఉత్తమ గ్రామపంచాయతీ కార్యదర్శులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న ఇరువురు కార్యదర్శులను శనివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని మామిడిగుండాల గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి యాకరాజును శాలువా కప్పి సన్మానించారు. పోలారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తిని ఎంపీడీఓ బాలరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తమ పనితీరుతో జిల్లా అధికారుల మన్నలు పొంది ఉత్తమ కార్యదర్శులుగా ప్రశంసా పత్రాలు పొందారని హర్షం వ్యక్తం చేశారు. ఇతర కార్యదర్శులు తమ పనితీరును మరింతగా మెరుగు పర్చుకొని అవార్డుల సాధించేలా కృషి చేయాలని సూచించారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. జూలూరుపాడు, కాకర్ల, పడమటనర్సాపురం, పాపకొల్లు, గుండెపుడి జిల్లా ఉన్నత పాఠశాలల విద్యార్థులతోపాటు, పడమటనర్సాపురం వశిష్ఠ విద్యాలయం విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో టెస్ట్ నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో కాకర్ల హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం జూలూరుపాడు హైస్కూల్ విద్యార్థులు పొందారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానం జూలూరుపాడు హైస్కూల్, ద్వితీయ స్థానం కాకర్ల హైస్కూల్ విద్యార్థులు పొందారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రథమ స్థానం వశిష్ఠ విద్యాలయం విద్యార్థులు దక్కించుకున్నారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ధర్మారావు, సామ్యేలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, గురుమూర్తి, రామనాథం, బి.సంపత్, శాంతకుమారి, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఐని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రాంచందర్ నాయక్

టేకులపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సీపీఐ బలోపేతానికి ప్రతీ కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు సభ్యత్వం పూర్తి చేసుకుని గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐతో పొత్తుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎంపీ మరియు స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని, పార్టీ సభ్యత్వం త్వరగా పూర్తి చేసుకోవాలని, కమిటీ నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు గుగులోతు శ్రీను, వాసం భద్రయ్య, అయిత శ్రీరాములు, బానోతు వీరన్న, తేజావత్ లక్ష్మణ్, వాసం నరేందర్, తేజావత్ మధు, జాటోత్ భోజ్యా, సోని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ ఉన్న వారి వెంటే విజయం



విజేతలతో ఎమ్మెల్యే కనకయ్య, తదితరులు

ఇల్లెందు: ఏ రంగంలోనైనా ప్రతిభ ఉన్న వారిని విజయం వరిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లెందులోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం బ్లూ మూన్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యాన డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు ముద్రగడ వంశీ, డానియేల్, పులి సైదులు, మండల రాము, వరలక్ష్మి, డాన్స్ మాస్టర్లు పొదిలి శ్యామ్, శ్రీకాంత్, రవితేజతో పాటు కౌన్సిలర్లు వారా రవి, నవీన్, లక్ష్మి, మంజుల, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా, పోటీల్లో సాయిబాలాజీ, అరవింద, మోక్షజ్ఞ, స్వాతి, భవిత, అర్జున్, సౌమ్య, నాగమైత్రిరెడ్డి, కుంట లహరి, తేజస్వి విజేతలుగా నిలవగా ఆహుతులు బహుమతులను అందజేశారు.

## ఎంపీగా పోటీకి సహకరించండి

టేకులపల్లి: తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు శనివారం కోయగూడెంలోని ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాసంలో ఆయనను కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపు తనకు అవకాశం ఇవ్వాలని, అందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరుతూ తన ప్రొఫైల్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు. 1993 విద్యార్థి దశ నుంచి విద్యారంగ సమస్యలపై పోరాడుతూ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్‌గా, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ, సామాజిక న్యాయం కోసం, విపత్తుల సమయంలో తనవంతు సహాయం చేసినట్లు చెప్పారు. రాజకీయంగా కుటుంబ నేపథ్యం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన చరిత్ర ఉందని, ఆదివాసుల ఓటు బ్యాంకు అధికంగా ఉన్న ప్రాంతం కావడం, ఆదివాసీల కోసం పనిచేసిన నాయకుడిగా, అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పరిచయం ఉన్న ఆదివాసీ నాయకుడిగా, 1999 నుంచి నేటివరకు కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివాసీ నాయకుడిగా అధిష్టానం గుర్తించి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని కోరారు.

## సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వేదికగా జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2023–2024 జరిగాయి. ఇందులో పాఠశాల స్థాయిలో ప్రైవేట్, గవర్నమెంట్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా, మండల స్థాయిలో త్రివేణి విద్యార్థులు కె.నేహాసంజన, బి.నేహా, శ్రీ బద్రన్, సీహెచ్ మోక్షిత ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

ఈ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి జగదీశ్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య శ్రీకాంత్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కమిటీ నియామకం

చుంచుపల్లి: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గ కమిటీని జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా యర్రం రాజు బెహరా, వరప్రసాద్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, పసుమర్తి సతీష్, జి.రామచంద్ర నాయక్‌లను నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చింతలచెర్వు శ్రీనివాసరావు, మడివి రవి, తాటిపాముల ఐలయ్య, జిల్లా కార్యదర్శులుగా కణితి లక్ష్మి, బానోత్ విజయలక్ష్మి, బైరి నిర్మల, ముత్యాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎస్‌వీటీ కొండను నియమించారు. వీటితో పాటు జిల్లా అధికార ప్రతినిధులు, పలు విభాగాలకు మోర్చాలను నియమించారు.

## నర్సరీల్లో టేకు మొక్కలేవి?



తోగ్గూడెం నర్సరీలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

పాల్వంచరూరల్: టేకు మొక్కలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని గతేడాది నుంచి గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో టేకు మొక్కలు లేకుండానే ఇతర మొక్కలను మాత్రమే పెంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీల్లో గతేడాది నుంచి టేకు జాతి మొక్కల విత్తనాలను నాటకుండానే ఇతర ఉపయోగం లేని మొక్కల విత్తనాలను పెంచుతున్నారని రైతులకు ఉపయోగపడే టేకు జాతి మొక్కలను పెంచాలని రైతులు కోరుతున్నారు. గతంలో టేకు మొక్కలు పెంచే రైతులకు మొక్కకు ఈజీఎస్ కింద రూ.5 చొప్పున రైతులకు చెల్లించి టేకు వనాలను పెంచేవిధంగా ప్రోత్సహించిన ప్రభుత్వం గతేడాది నుంచి టేకు మొక్కల విత్తనాలను పెంచడం మరిచిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం నర్సరీలో టేకు మొక్కలను పెంచి రైతులకు గతంలో మాదిరిగానే పంపిణీ చేసి ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఓ రంగాను వివరణ కోరగా... గతేడాది నుంచి నర్సరీలకు టేకు మొక్కల విత్తనాల సరఫరా జరగడం లేదన్నారు.

# లైట్లు వెలిగేది ఎన్నడో?

- లక్ష్మీదేవిపల్లి – పెద్దమ్మతల్లి గుడి వరకు అసంపూర్తి పనులు
- ఇందిరానగర్ పెట్రోల్ బంక్ – పెద్దమ్మగుడి వరకు అంధకారం
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లపై నిర్లక్ష్యం



బీసీఎం జాతీయ రహదారి

పాల్వంచరూరల్: అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సెంట్రల్ లైటింగ్ పనుల నిర్మాణంలో తీవ్రజాప్యం జరుగుతోంది. విద్యుత్ పోల్స్‌కు లైట్లు ఏర్పాటు చేసి మూడు నెలలు గడిచినా నేటికీ ఇంకా పనులు పూర్తి కాలేదు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మతల్లి గుడి వరకు రూ.2.7 కోట్ల వ్యయంతో సీఎస్ఆర్ పాలసీ నిధుల కింద 2022లో మంజూరైన సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. సెంట్రల్ లైటింగ్ ఎప్పుడు పూర్తవుతాయో, ఎప్పుడు వెలుగులు విరజిమ్ముతాయోనని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో కొనసాగుతున్న లైటింగ్ పనులు ఆరు కిలోమీటర్ల పొడవున బీసీఎం జాతీయ రహదారి డివైడర్ మధ్యలో 135 విద్యుత్ పోల్స్‌ను నిర్మాణం చేశారు. కాంట్రాక్టర్ విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేసి లైట్లను కూడా అమర్చారు. ఇంకా గుడి వద్ద హైమాక్స్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇందిరాకాలనీ పెట్రోల్ బంక్ నుంచి లక్ష్మీదేవిపల్లి, బస్వతారక కాలనీ, కేశవాపురం, పెద్దమ్మగుడి, జగన్నాథపురం గ్రామం వరకు పోల్స్‌ను ఏర్పాటు చేశారు.

**రాత్రివేళలో ప్రమాదాలు...**

లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మగుడి వరకు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు లేకపోవడం వలన రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం 24గంటలు వాహనాల రద్దీ అధికంగా ఉండే బీసీఎం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే సెంట్రల్ లైటింగ్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు గత అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు.

### పనులు త్వరగా పూర్తిచేయాలి



బీసీఎం జాతీయ రహదారిపై నాలుగు నెలల క్రితం సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించినా ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. దీంతో రాత్రిసమయంలో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, బస్వతారకకాలనీ

### జాతీయ రహదారిపై అంధకారం



ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ నుంచి జగన్నాథపురం వరకు బీసీఎం జాతీయ రహదారిపై లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలి.

– సాయిరెడ్డి, నారాయణరావుపేట

### అనుమతులు రావాల్సి ఉంది..



లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మ గుడి వరకు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను తర్వలోనే పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. విద్యుత్‌శాఖ నుంచి కనెక్షన్ కోసం అనుమతులు రావాల్సి ఉంది. నెలరోజుల్లో పనులు పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ వెలుగులను అందిస్తాం.

– అనిల్‌కుమార్, పీఆర్ ఏఈ